www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శుక్రవారం 07.02.2025

## విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




# అత్యధిక గ్రామాలను ఏకగ్రీవం చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల పదవులు కేటాయించాలి
- గ్రామాల్లో అభివృద్ధి నిధుల కోసం మంత్రులను కలవండి
- పల్లెల్లో ప్రభుత్వ హామీల అమలును పరిశీలించండి
- ప్రజలతో మమేకమై పని చేస్తూ పార్టీ ప్రతిష్టను పెంచాలి
- విభేదాలు పక్కనబెట్టి పార్టీ, ప్రభుత్వం కోసం పని చేయాలి
- పార్టీ నిర్ణయాలు వ్యతిరేకిస్తే ఎంతటివారైనా ఉపేక్షించం
- సీఎల్పీ సమావేశంలో సీఎం

కలంజ్యోతి, హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేయించుకోవాల్సిన బాధ్యత ఆయా ఎమ్మెల్యేలదేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ బలం మరింతగా పెరగాలంటే ఏకగ్రీవాలు అనివార్యమన్నారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచించారు. అయితే ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగే విధంగా ఉండాలన్నారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి,

మిగతా 2లో



## రాష్ట్రపతికి జెర్సీ బహూకరించిన సచిన్

2లో



## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

### నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

కలంజ్యోతి, నిర్మల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. నిర్మల్ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గ్రామాలలో ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీలైన బిజెపి బిఆర్ఎస్ లకు ధీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క తోడ్పాటుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని దిశా నిర్దేశం చేశారు.



కలంజ్యోతి
శుక్రవారం 07.02.2025



# రాష్ట్రపతికి జెర్సీ బహూకరించిన సచిన్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూతో ప్రముఖ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ కలిశారు. గురువారం న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి నిలయంలో ముర్మూను కుటుంబంతో సహా కలిసిన సచిన్ టెస్ట్ జెర్సీని బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి, సచిన్ పలు విషయాలపై చర్చించారు. రాష్ట్రపతి నిలయం బయట ఉద్యానవనంలో వీరిద్దరి సంభాషణలు జరిగాయి. అనంతరం సచిన్ కుటుంబంతో సహా రాష్ట్రపతితో కలిసి ఫొటోలు దిగారు.

– కలంజ్యోతి, న్యూ ఢిల్లీ



# సూర్యాపేటకు రాహుల్.. మెదక్ కు ఖర్గే..

## మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్


**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసిన కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై ముమ్మర ప్రచారం నిర్వహించాలని పార్టీ నిర్ణ యించిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. ఇందుకోసం త్వరలోనే ఇద్దరు ఏఐసీసీ అగ్రనేతలు తెలంగాణలో పర్యటిస్తారని ప్రకటిం చారు. సూర్యాపేట లో కుల గణనపై రాహుల్ గాంధీతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్సీ వర్గీకరణపై మెదక్ లో ఖర్గేతో బహిరంగ నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఆయా సభల్లో ఇద్దరు అగ్రనేతలను ఆహ్వానించేందుకు గురువారం ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్ లో సీఎల్పీ సమావేశం తర్వాత ఆయన మీడియా తో మాట్లాడారు. కుల గణనపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో ఉన్న అనుమానాలను సీఎల్పీ భేటీలో నివృత్తి చేశామన్నారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలపైనా వారికి క్లారిటీ ఇస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ నేతలు, క్యాడర్ కు దిశానిర్దేశం చేసేందుకు సీఎల్పీ భేటీ నిర్వహించినట్లు చెప్పారు. ఆ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపుకోసం ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించబోతున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశామన్నారు.

# అత్యధిక గ్రామాలను ఏకగ్రీవం చేయాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

▸▸ మొదటిపేజీ తరువాయి

వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి స్థాయిలో విజయాన్ని సాధించాలన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు, పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో పని చేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై పని చేస్తూ పార్టీ ప్రతిష్టను పెంచాలని చెప్పారు. పార్టీ నేతలు, క్యాడర్ అందరూ ఒకే తాటిపై నిలిచి పని చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి నియోజకవర్గ గ్రామస్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. అలాగే తాము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పూర్తి చేసిన బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ అంశాలపై ప్రచారం చేయడంలో వెనకబడ్డామని సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రెండు చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. సీఎల్పీ భేటీలో బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణపై కీలకంగా చర్చించిన సీఎం ఆయా అంశాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు..ఇది అత్యంత కీలకమైన శాసనసభ పక్ష సమావేశమన్నారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణపై కీలక సూచనలు సీఎం చేశారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నిక విషయంలో ఎమ్మెల్యేలకే బాధ్యతలు ఇచ్చారని తెలిపారు. సమస్యలు, ఇబ్బందులు ఉన్న ఎమ్మెల్యేలు కూడా సమావేశంలో ఆవేదన చెప్పుకున్నారన్నారు. సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడితో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల సమావేశం ఉండడంతో సాయంత్రం జరగాల్సిన సీఎల్పీ మీటింగ్‌ను ఉదయానికి మార్చినట్లు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.







# కడ్తాల్ వై జంక్షన్ సమస్యకు చర్యలు తీసుకోండి

## అధికారులకు కలెక్టర్ అభిలాష ఆదేశాలు



**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ సమీపంలోని జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదే శించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్ లో సంబంధిత అధికారులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడ్తాల్ జాతీయ రహ దారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారు లందరితో ఇప్పటికే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డీఓ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవు తున్న ఇబ్బందులను పరిశీలించిం దన్నారు. రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం తోపాటు , శాశ్వత పరిష్కారం పూర్తయ్యేలోపు తాత్కాలికంగా ప్రమాదాలను నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. కడ్తాల్ నుంచి నిర్మల్ వైపుకు వాహనాలు మళ్లే దారిలో తాత్కాలి క రహదారి విభాగినులను ఏర్పాటు చేసి, భారీ వాహనాలు మళ్ళుతాయో లేదో తెలుసుకు నేందుకు పరిశీలనాత్మకంగా అధికారులు, గ్రామస్తుల సమక్షంలో ఆర్టీసీ బస్సులను తిప్పి చూడాలన్నారు. వీలైనంత త్వరగా గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్తుల నుంచి సమస్య పరిష్కా రానికి సూచ నలను తీసుకున్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఎస్పి జానకి షర్మిళ, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రా రెడ్డి, ఆర్డిఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్టీవో దుర్గప్రసాద్, సోన్ మండ ల తహసిల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, కడ్తాల్ గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి చెన్నా పరామర్శ

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండలం శంకరంతండా గ్రామం వాయిల్ తండాలో జరుపుల మోతు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చెన్నారావుపేట పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోతు మృతుదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బాధావత్ విజేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వంగపల్లి చిన్నరాజు, గంధే అభిలాష్, తదితరులున్నారు.

# సీఎం రుణం తీర్చుకుంటాం

## కాంగ్రెస్ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు కన్నం సందీప్



**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసిన ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై కాంగ్రెస్ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు కన్నం సందీప్ హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీల ఆకాంక్షలు తీర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎస్సీ సామాజిక వర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ ప్రభుత్వానికి ఎస్సీ సామాజిక వర్గం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. ఈ నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకి ఒకింత బలాన్ని చేకూర్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల పాలన కొనసాగించే విధమైన నిర్ణయాలను తీసుకునే దమ్ము కలిగినటువంటి పార్టీ అని సందీప్ వ్యాఖ్యానించారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

## హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముల్కనూరులో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రజలకు అండగా నిలవాలని, అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాలని కోరారు. అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్, నాయకులు వంగ రవి సంగ సంపత్, జక్కుల అనిత, అప్పని పద్మ, శరీఫొద్దీన్, నవాబ్ పాషా, రజనాచారి, రచ్చ సంపత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.






# కుటుంబ కలహాలతో ఏఆర్ఎస్ఐ ఆత్మహత్య

**కలంజ్యోతి, ములుగు :** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో విషాద ఘటన జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారంలో ఏఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సయ్య భార్య సునీత ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తుంది. భార్యాభర్తల మధ్య నెలకొన్న గొడవల వల్లనే నర్సయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కాటారంలో రోడ్డు ప్రమాదం



**కలంజ్యోతి, జయశంకర్ భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. కాటారం మండలంలోని సబ్ స్టేషన్ పల్లికి చెందిన తోట రవి ద్విచక్ర ఇంటికి వెళుతుండగా కాళేశ్వరం నుండి భూపాలపల్లికి వెళ్తున్న ఇసుక లారీ బైకును ఢీకొట్టడంతో రవి కింద పడిపోయాడు. అతడి కాళ్లపై నుండి లారీ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన రవిని హనుమకొండ హాస్పిటల్ కి తరలించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గాలిపల్లి యువకుడు



**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన రాగిరి హర్షవర్ధన్ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లాస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నిర్వహకులు తెలిపారు. ఈ 4 నుంచి 7 వరకు ఆదిలా బాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలలో పాల్గొంటున్న యువకుడిని గాలిపల్లి ఈతరం యూత్ అధ్యక్షులు జి.నరేష్, కార్యదర్శి సాయిగణేష్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎంద్ర నారాయణ, ఉపాధ్యక్షులు గౌడ సంతోష్, బట్టు విజయ్, సంఘ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు మరియు గ్రామస్తులు హర్షవర్ధన్ ను అభినందించారు.

## జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలోని ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో ఐకేపీ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రధాన రహదారిపై టిప్పర్, బైక్ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ప్రమాదంలో తల, మొండెం రెండు వేరయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఎండపల్లి గ్రామానికి చెందిన చీకటి వెంకటేష్ (45)గా స్థానికులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

### మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్





**కలంజ్యోతి , జగిత్యాల :** చేనేత హస్తకళలను అందరు ప్రోత్సహించాలని జగిత్యాల తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టౌన్ హాల్ ప్రాంగణంలో చేనేత హస్తకళల హ్యాండ్లుం, హ్యాండిక్రాఫ్ట్స్ చేనేత హస్తకాళల ప్రదర్శన స్టాల్ ను మున్సిపల్ చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత హస్త కళలు పురాతనమైనవన్నారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను దాటే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించి ఆదరించాలన్నారు. ప్రదర్శన ఉంచిన ఉత్పత్తులు ఎంతగానో ఆకట్టుకుందనీ, ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం నిర్వహకులు చైర్ పర్సన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వల్లెపు మొగిలి, నాయకులు,చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులున్నారు.

## మెరుగైన వసతులు కల్పించాలి




**కలంజ్యోతి, నిర్మల్ : ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు సూచించారు. గురువారం రాత్రి సారంగాపూర్ మండలంలోని జామ్ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రాత్రి వేళల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకుని, ప్రణాళిక ప్రకారం చదవాలని సూచించారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. భోజనానికి నాణ్యమైన వస్తువులు, కూరగాయలను మాత్రమే వినియోగించాలన్నారు. వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్ లు, విద్యార్థుల వసతి గదులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో డీఈఓ పి.రామారావు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈవో మధుసూదన్, ఎంపీఓ అజీజ్ ఖాన్,ప్రధానోపాధ్యాయులు సంగీత, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.**



టాలీవుడ్ హీరోయిన్ ప్రణీత సుభాష్ 'బావ' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి తన అందం, అభినయం, నటనతో ప్రేక్షకులను మెప్పించి ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. ఆ తర్వాత పాండవులు పాండవులు తుమ్మెద, రభస, డైనమైట్, హాలో గురు ప్రేమ కోసమే, వంటి చిత్రాల్లో నటించింది. ఇక పవన్ కల్యాణ్ తో 'అత్తారింటికి దారేది' సినిమాలో నటించి స్టార్ డమ్ తెచ్చుకుంది. అయినప్పటికీ అమ్మడుకి ఎక్కువగా అవకాశాలు రాకపోవడంతో సినిమాలకు దూరం అయింది. ఈ క్రమంలోనే ఆమె తన ప్రియుడిని పెళ్లి చేసుకుని పర్సనల్ లైఫ్‌పై ఫోకస్ పెట్టింది. ఇక వీరి ప్రేమకు గుర్తుగా ఈ జంటకు ఒక పాప పుట్టింది. ఇటీవల ఓ కూడా జన్మించాడు. అయితే ప్రణీత ఇండస్ట్రీకి దూరం అయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది. నిత్యం తన ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమె నిత్యం ఏదో ఒక పోస్ట్ పెడుతూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా, ప్రణీత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని హాట్ ఫొటోస్ షేర్ చేసింది. ఇందులో మత్తెక్కించే చూపులతో హాట్ ఫొటోలకు పోజులిచ్చింది. ఇక ఇందుకు సంబంధించిన వీడియో, పిక్స్‌ను నెట్టింట పెట్టి కుర్రాళ్లకు హీట్ పుట్టిస్తోంది.